

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ఈ ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు

శ్రీశైలంలో డ్రోన్ కెమెరా స్వాధీనం

శ్రీశైలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలో డ్రోన్ కెమెరాను వినియోగిస్తున్న ఇద్దరు యువకులను ఆదివారం సాయంత్రం దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జి. స్వాములు ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది ఆలయ పుష్కరిణి సమీపంలో డ్రోన్ కెమెను ఆపరేట్ చేస్తున్న ఇద్దరు యువకులను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరిని శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. యువకుల వద్ద నుంచి డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టామని, వివరాలు తెలియాల్సి ఉందని సీఐ జి. ప్రసాదరావు తెలిపారు.

శ్రీశైలంలో అఘోరీ



దర్శనానికి వెళ్తున్న అఘోరీ

శ్రీశైలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం మహిళా అఘోరీ దర్శించుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రాలను దర్శించుకుంటూ శనివారం మహానంది దేవాలయాన్ని సందర్శించుకుని ఆదివారం శ్రీశైలం వచ్చారు. శ్రీశైలం చేరుకున్న అఘోరీకి పోలీసులు, దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. దర్శనానంతరం అఘోరీ కనకదుర్గమ్మ దర్శనానికి విజయవాడకు వెళ్లారు.



శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

- శ్రీశైలంలో వైభవంగా కొనసాగుతున్న కార్తీక మాసోత్సవాలు
- నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు



శ్రీశైలం, నవంబరు 10: శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర వీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారం రోజులలో భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరం తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనం అనంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజను నిర్వహించి, దీప ప్రజ్వలన, దీపారాధనలు చేశారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానం అఖండ శివ భజనల కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించారు. స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు

కార్తీక రెండో సోమవారం పురస్కరించుకొని సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించనుంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా పూజాదికాలు జరిపి అనంతరం పుష్కరిణికి దశవిధ హారతులు సమర్పించనున్నారు. లక్షదీపోత్సవం కార్యక్రమం సందర్భంగా పుష్కరిణి ప్రాంగణమంతా వివిధ ఆకృతులలో దీపాలను ఏర్పాటు చేయనున్నారు.



దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు



దర్శనం కోసం కంపార్ట్‌మెంట్‌లో వెయిట్ చేస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ పరిసరాలు

కష్టాల్లో ఉర్దూ పాఠశాలలు

- ఉపాధ్యాయుల కొరత
- ఆగిన పాఠశాల భవనాల పనులు
- ఉన్నత చదువులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



చాగలమర్రిలో ఒకే గదిలో చదువు చెబుతున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో ఉర్దూ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయి. తెలుగు, ఆంగ్ల పాఠశాలల్లో ఉర్దూ బోధన కొనసాగడం లేదు. 1 నుంచి 5వ తరగతి మాత్రమే ఉర్దూ పాఠశాలలో విద్యాబోధన కొనసాగుతోంది. 5వ తరగతి తర్వాత ఉర్దూ విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం లేదు. దీంతో వాళ్ల చదువు ఆగిపోతోంది. ప్రభుత్వం యూపీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినా ఉపాధ్యాయుల కొరత, తరగతి గదులు లేక ఆ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. జిల్లాలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు 73, యూపీ పాఠశాలలు 24, ఉన్నత పాఠశాలలు 17 ఉన్నాయి. ఉర్దూ పాఠశాలల్లో 6,195 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయుల కొరత, అసంపూర్తిగా భవనాలతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. గత వైసీపీ పాలనలో నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలలను పట్టించుకోకలేదు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉర్దూ విద్యకు గడ్డు రోజులు తయారయ్యాయి. ఆళ్లగడ్డ మండలంలో 2 ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఉండగా అందులో 70 మంది చదువుతున్నారు. ఓబుళంపల్లెలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఐదుగురే ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. శిరివెళ్ల మండలం యర్రగుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదుగురికి గాను నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. బోయలకుంట్లలో గతంలో 60 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయ పోస్టులను 3 నుంచి 2కు తగ్గించారు. శిరివెళ్ల మండల కేంద్రంలో 2 యూపీ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతున్నారు. దొర్నిపాడు మండలంలోని చాకరాజువేముల, దొర్నిపాడు యూపీ పాఠశాలలో ఉర్దూ బోధిస్తున్నారు.

మిగతా 7లో..



నేలపైన కూర్చున్న విద్యార్థులు

బాధితులంతా కలెక్టరేట్‌కే

- నమ్మకం కల్పించని మండల యంత్రాంగం
- సమస్యను పరిష్కరించకుండానే ఫైల్ క్లోజ్
- ప్రతి వారం రద్దీగా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంలో అనేక అంచెల వ్యవస్థలు ఉన్నాయి. ఊళ్లలో గ్రామ, వార్డు సచివాలయాలు పని చేస్తున్నాయి. ప్రతి మండలంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తదితర ప్రభుత్వ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎమ్మార్వో కార్యాలయం నుంచి కమిషనర్ కార్యాలయం వరకు వెళ్లి బాధితులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలి. కానీ క్షేత్రస్థాయి అధికారులు ఆ నమ్మకం ఇవ్వడం లేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున పోటెత్తుతున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ యంత్రాంగ కర్తవ్యం. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి ప్రయత్నించాలి. దీని కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలో, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రభుత్వం నిర్వహిస్తోంది. కానీ అక్కడ అధికారులు సమస్యలు పరిష్కరించకుండానే ఫైల్ మూసేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితులు కర్నూలే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెళ్లక తప్పడం లేదు. కింది స్థాయిలో పరిష్కారంకాని సమస్యలు మాత్రమే కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి వెళ్లాలి. కానీ దీనికి పూర్తి భిన్నంగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మిగతా 6లో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



దానియేలు (ఫైల్)



ఇర్ఫాన్(ఫైల్)

ఎమ్మిగనూరు/నందవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నందవరం మండలంలోని ముగతి, ధర్మాపురం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దకడుబూరు మండలం జాలవాడికి చెందిన దానియేలు(24), కమ్మలదిన్నెకు చెందిన వంశీ(21) ఒకే బైకుపై వెళ్తున్నారు. ఎమ్మిగనూరు షైనార్టీ కాలనీకి చెందిన ఇర్ఫాన్(21) ఓ బైకుపై వెళ్తున్నారు. అయితే రెండు బైకులు ఢీకొనడంతో దానియేలు, ఇర్ఫాన్ అక్కడిక్కడే మృతి చెందారు. వంశీ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు కూడా మృతి చెందాడు. నందవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతి కోసం..

ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కృషి చేయాలి

నేటి నుంచి 11 రోజులు అసెంబ్లీ సమావేశాలు 7

మాయమవుతున్న నది

కర్నూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నది ఉనికి కోల్పోతున్నది. తుంగభద్ర ఉప నదిగా జిల్లా నీటిపారుదల వ్యవస్థలో హంద్రీకి ప్రాధాన్యత ఉంది. అలాంటి నది కబ్జా కోరల్లో చిక్కుకున్నది. కల్లూరు మండలం దేవనగర్ దగ్గర పేరుగాంచిన రియల్టర్ ఒకరు నది పరంబోకు స్థలం అక్రమించాడు.. నిబంధనలు తుంగలో కలిపేసి బఫర్ జోన్‌లోనే పక్కా భవనాలు నిర్మించాడు. జలవనరుల శాఖ ఇంజనీర్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ, నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకుల అండదండలతో చిన్నటేకూరు గ్రామం దగ్గర హంద్రీ నది భూముల్లో కొందరు ఏకంగా వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. అక్కడ ఎకరం రూ.1.50 కోట్లు పైమాటే. నాడు అధికారం మాటున వైసీపీ నేతలు కబ్జాలకు పాల్పడితే.. నేడు టీడీపీ ముఖ్య నాయకుల పేర్లు చెప్పి నదీ స్థలాల్లో జెండా పాతుతున్నారు. అలారుదిన్నె నుంచి కల్లూరు వరకు హంద్రీనది తీరం కబ్జాకు గురవుతున్న తీరుపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్న హంద్రీ నది పరంబోకు భూములు ఇవే..



- కల్లూరు మండలం దేవనగర్ దగ్గర హంద్రీని ఆక్రమించిన ఓ రియల్టర్
- చిన్నటేకూరు దగ్గర కబ్జాకు గురవుతున్న నది భూమి
- అనధికారింగా వెంచర్ వేసి ప్లాట్లు అమ్మేందుకు యత్నాలు
- టీడీపీ నాయకుల అండతో పెట్రేగుతున్న అక్రమార్కులు
- పెద్దపాడు వద్దోని వంకను కాజేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి
- పట్టించుకోని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు



ఆస్పరి మండలం అలారుదిన్నె..హంద్రీ నది మొదలయ్యేది ఇక్కడే..

పత్తికొండ మండలం పందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహుల్తి ఎగువన మరో పాయ (వంక)గా మొదలయ్యే హంద్రీనది దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో కలిసి దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహిస్తూ.. కర్నూలు నగర శివారు జొహరాపురం దగ్గర తుంగభద్రలో కలుస్తున్నది. నగరం మధ్యలో 5.40 కి.మీలు హంద్రీ ప్రవహిస్తుంది. నదిని సంరక్షించాల్సిన జలవనరుల శాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. ఫలితంగా రూ.కోట్లు విలువైన హంద్రీనది పరంబోకు భూములు కబ్జాకు గురవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో హంద్రీ, వక్కేరు నదులు ఇష్టారాజ్యంగా అక్రమించారని నాడు టీడీపీ నేతలు ఆరోపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమణలు తొలగించి నదిని కాపాడుతారని ప్రజలు ఆశిస్తే.. ఇందుకు విరుద్ధంగా టీడీపీ ముఖ్య నాయకుల పేర్లు చెప్పి నిబంధనలు విరుద్ధంగా నది తీర భూముల్లో వెంచర్లు వేయడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.



పెద్దపాడు వద్ద రియల్టర్ వద్దోని వంకను కలిపేసుకొని నిర్మించుకున్న సీసీ కాంక్రీట్ గోడ

మిగతా 6లో..

నీలాకాశంతో కనువిందు చేస్తున్న ఆలయ పరిసరాలు



ఆహ్లాదం.. ఆధ్యాత్మికం



స్వయంభువుగా వెలసిన మహానందీశ్వరస్వామి

- మహదానంద క్షేత్రం మహానంది
- అద్భుతమైన జలసంపద ఇక్కడి ప్రత్యేకత
- కోనేటి నుంచి నిరంతరం నీటి ప్రవాహం
- రెండో లేపాక్షిగా ప్రసిద్ధిగాంచిన రాతి నంది
- ఆకట్టుకుంటున్న బాదామి చాళుక్యుల శిల్ప కళ
- మహిమాన్వితుడు మహానందీశ్వరుడు
- ప్రత్యేక పూజల కోసం తరలి వస్తున్న భక్తులు

మహానంది, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు, ఆహ్లాదానికి నిలయం మహానంది క్షేత్రం. ఎప్పటికీ తరగని నీటితో ప్రత్యేకతను సంతరించుకున్న ఆలయం. శివ కేశవులిద్దరూ కొలువైన క్షేత్రం ఇది. పచ్చటి ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలారావాలతో ఇక్కడి పరిసరాలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. అద్భుత జలసంపన్నుడిగా మహానందీశ్వరుడు నిత్య పూజలందుకుంటున్నాడు. స్వయంభువుగా వెలసిన స్వామివారి చెంత ఉన్న శిల్ప కళ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నారీమణులతో రూపుదిద్దిన అశ్వం, ఏనుగులతోపాటు సిద్ధి, బుద్ధి గణనాథుల శిల్పాలు సైతం ఇక్కడ కనిపిస్తాయి. నందన మహారాజులు, శ్రీకృష్ణ దేవరాయలు లాంటి ఎందరో చక్రవర్తులు మహానందికి వచ్చారని చరిత్ర చెబుతోంది. మహానందీశ్వర స్వామి గర్భాలయం బాదామి చాళుక్యులు ఆరో శతాబ్దంలో నిర్మించినట్లు పురావస్తు శాఖ అధికారులు చెబుతుంటారు. మహానంది క్షేత్రానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్నది.

మహానంది అంటే గుర్తుకు వచ్చేది కోనేరులే..

మహానందిలో శివరాత్రి ఉత్సవాలతోపాటు కార్తీక మాసం, దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం కార్తీక మాసం ఉత్సవాలు కన్నులపండుగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో దీపం, స్నానాలకు ఎంతో విశిష్టత ఉంది. మహానందిలో గంగాదేవి స్వయంభువుగా వెలసిందని భక్తులు చెబుతారు. అందువల్లే పుణ్యస్నానాలు చేసేందుకు అమితాసక్తిని చూపుతారు. మహానంది అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఇక్కడి కోనేరులే. దీంతో భక్తులు కార్తీక మాసంలో నెల పొడవునా పెద్దకోనేరు (రుద్రగుండం)లో కార్తీక పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులకు అనుమతించారు. మహానంది ఆలయం ముందు ఏర్పాటు చేసిన అతి పెద్ద రాతి నంది విగ్రహం చుట్టూ ఫౌంటెయిన్, పచ్చటి పూల మొక్కలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడి రాతి నంది రెండో లేపాక్షిగా ప్రసిద్ధి చెందింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వచ్చి మహానందీ శ్వరుడిని దర్శించుకుంటున్నారు.



ఆలయం ముందు ఉన్న నంది సర్కిల్



రెండు వేల ఎకరాలకు కోనేటి నీరు

మహానంది ఆలయ పరిసరాల్లోని పొలాలకు నిత్యం కోనేటి నీరు సరఫరా అవుతోంది. దాదాపు రెండు వేల ఎకరాలకు ప్రతి రోజూ రైతులు కోనేటి నీరును పారించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా అరటి, పసుపు తోటలు సాగవుతున్నాయి. వరిని కూడా విరివిగా పండిస్తున్నారు. వీటన్నింటికీ కూడా మహానంది కోనేరు నీటినే రైతులు వినియోగించుకుంటున్నారు. ఇక్కడే పండే అరటికి ప్రత్యేక ఉంది. అరటి పండ్లు చిన్నవిగా ఉండి బాగా తీపిగా ఉంటాయి. దీంతో ఇతర ప్రాంతాలకు ఈ పండ్లను విరివిగా ఎగుమతి చేస్తుంటారు.

గుండుసూది పడినా కనిపించేంతగా..



మహానంది క్షేత్రంలోని కోనేరు నీటికి ఓ ప్రత్యేక ఉంది. గుండుసూది పడినా కనిపించేంత స్వచ్ఛంగా ఇక్కడి నీరు ఉంటుంది. దీనికితోడు నీరు పెరగడం, తరగడం ఉండదు. ఎప్పుడు ఒకే స్థాయి వరకు ఉంటుంది. వేసవి కాలం వచ్చినా అంతే నీరు రుద్రగుండం కోనేరులో ఉంటుంది. అంతేగాకుండా ఈ కోనేరులో స్నానాలు చేస్తే చర్మ రోగాలు వంటివి నయమవుతాయని భక్తులు చెబుతుంటారు.

ఎవరికీ అంతుబట్టని జల సంపద

మహానంది క్షేత్రంలోని రుద్రగుండం కోనేటిలోకి నీరు ఎలా వస్తుందనేది ఇప్పటికీ ఎవరికీ అంతుబట్టడం లేదు. నల్లమల అడవుల నుంచి భూగర్భం ద్వారా నీటి ధారలు కోనేరులోకి వచ్చి కలుస్తుంటాయని కొందరు చెబుతున్నారు. కోనేరులోకి నీరు ఎలా వచ్చే విషయం తెలియకున్నా ఇక్కడి నుంచి మాత్రం నీరు దిగువకు వెళ్తానే ఉంటుంది. ఆలయ పరిసరాల్లో ఉన్న మరో రెండు కోనేర్లలోకి నీరు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ రుద్రగుండం కోనేరులో మాత్రం నీరు తరగడం లాంటిది అస్సలు కనిపించదు.



ఆకట్టుకుంటున్న శిల్పం



నారీమణులతో అశ్వ శిల్పం

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు, భరోసా ఉంటాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్ఆర్‌పేటలో నిర్వహిం చిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మానికి రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వర రావు యాదవ్, నంద్యాల నాగేంద్ర, ఆకెపోగు ప్రభాకర్‌లతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నందమూరి తారక రామారావు తరువాత నారా చంద్ర బాబు నాయుడు పార్టీని ముందుకు తీసుకెళ్తూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందు తున్నారన్నారు. ఇప్పటికే 70 లక్షల సభ్యత్వంతో బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. ప్రతి కార్యకర్త చెల్లించిన సభ్యత్వ రుసుం మొత్తం తిరిగి కార్యకర్తలకు లబ్ధి చేకూరే విధంగా యువనే నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి ఇన్సూ రెన్సు పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. చనిపోయిన కార్య కర్తలకు గతంలో ఇచ్చిన రూ 2లక్షల పరిహారం రూ. 5 లక్షలకు పెంచారని అన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు

రాష్ట్ర స్థాయి ఉత్తమ లెక్చరర్‌గా సౌజన్య



డోన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని బి.క్యాంపు బాలికల జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న సౌజన్యకు రాష్ట్ర స్థాయి ఉత్తమ లెక్చరర్ పురస్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ టీచర్స్ అవార్డుల్లో ఆమెకు ఈ పురస్కారం లభించింది. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సతీమణి సౌజన్య కర్నూలు నగరంలోని బి.క్యాంపు బాలికల జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తన ఉద్యోగ కాలంలో అందించిన సేవలకు, సాధించిన ఫలితాలకు గుర్తింపుగా ఇంటర్మీడియట్ విభాగంలో సౌజన్యకు ఉత్తమ జూనియర్ లెక్చరర్ అవార్డు లభించింది. తేదీ సోమవారం విజయవాడలో జరిగే జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సౌజన్య ఉత్తమ లెక్చరర్ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఉత్తమ లెక్చరర్ అవార్డు రావడం పట్ల సౌజన్యతో పాటు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

బాధితులంతా కలెక్టరేట్‌కే

(5వ పేజీ తరువాయి)

కర్నూలు జిల్లాలో దాదాపు 26 మండలాలు ఉన్నాయి. చిన్న మండలం పరిధిలో 10 గ్రామాలు, పెద్ద మండలం పరిధిలో 20 నుంచి 24 గ్రామాలు న్నాయి. మండల పరిధిలో తహసీ ల్దార్లు, ఎంపీడీవోలు సమ స్యల్ని పట్టించుకుని పరిష్కరిస్తారన్న నమ్మ కం బాధితులకు కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించి ఆ ఫైల్‌ను క్లోజ్ చేయాలి. కానీ కొం దరు అధికారులు విచారణ జరప కుం డానే తప్పుడు సమాచారంతో ఫైళ్లను క్లోజ్ చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో అధిక శాతం రెవెన్యూ, భూ సమ స్యల ఎక్కువగా వస్తున్నాయి. వాటి పరిష్కారంలో స్థానిక అధికారులు సరిగా వ్యవహరించడం లేదనే అసంతృప్తి ప్రజల్లో ఉంది.

ఇన్‌చార్జిల పాలనతో అస్తవ్యస్తం

జిల్లాలోని వివిధ శాఖలలో అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కొందరు అధికారులకు రెండు, మూడు శాఖల బాధ్యతల్లో ఉండటంతో పాలనపై దృష్టి సారించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల ఆ శాఖలలో ఉన్న అధికారులు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు గ్రామ, వార్డు సచివాలయాల మీద ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తనిఖీ లేకపోవడంతో సచివాలయల సిబ్బంది ప్రజలు సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. సచివాలయాలు, మండల కార్యాలయాలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే మంచి పరిపాలన అందించవచ్చని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

- కర్నూలు డివిజన్‌లో కల్లూరు మండలంలో 1484, కోడుమూరు మండలంలో 911, ఓర్వకల్లు మండలంలో 819, వెల్దుర్తి మండలంలో 781, మండలంలో 705, కర్నూలు రూరల్ మండలంలో 601లు ఉన్నాయి.
- ఆదోని డివిజన్‌లో మంత్రాలయం మండలంలో 989, పెద్దకడుబూరు మండలంలో 929, ఆదోని మండలంలో 822, గోనెగండ్ల మండలంలో 611, ఎమ్మిగనూరు మండలంలో 565, కోసిగి మండలంలో 402 ఉన్నాయి.
- పత్తికొండ డివిజన్‌లో దేవనకొండ మండలంలో 895, తుగ్గలి మండలంలో 877, ఆలూరు మండలంలో 708, ఆస్పరి మండలంలో 690, హాలహర్వి మండలంలో 708, రైతుల భూసమస్యలపై వినతులు ఇచ్చారు.

రీసర్వే జరిగిన గ్రామాల్లో సరాసరిగా రెవెన్యూ గ్రామసదస్సులో 100 నుంచి 500 వరకు రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మండల స్థాయిలో భూసమస్యల పరిష్కారం కాకపోతే కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

భూ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం:

ప్రతి గ్రామంలో రైతులు భూ సమస్యలుపై వీఆర్వో, ఎమ్మార్వో గ్రామ సర్వేకు ఫిర్యాదు చేస్తున్నారు. భూసర్వే సమస్యల పరిష్కారం కోసం గత నెల 8వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు.

మాయమవుతున్న నది

(5వ పేజీ తరువాయి)

కల్లూరు మండలం చిన్నటేకూరు పక్కన హంద్రీ నది ప్రవహిస్తుంది. ఈ ప్రాంతం హైదరాబాదు - బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారికి సమీపంలో ఉంటుంది. హంద్రీ నది కలుపుతూ వంక ప్రవహిస్తుంది. సర్వే నంబరు 1లో 130 ఎకరాలు నది పరంబోకు భూములు ఉన్నాయని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఊరు పక్కనే పరంబోకు ప్రభుత్వ భూములను ఆ ఊరికి చెందిన కొందరు రైతులు పట్టాలు లేకున్నా సాగు చేసుకొని జీవిస్తున్నారు. ఆన్‌లైన్ అడంగల్ రికార్డులు పరిశీలిస్తే.. పరంబోకు ప్రభుత్వ భూమిగానే కనిపిస్తుంది. జాతీయ రహదారికి సమీపంలో ఉండడం, అక్కడికి దగ్గర్లోనే సూరత్ - చెన్నై వయా కర్నూలు జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుండడంతో ఆ భూములకు భారీగా డిమాండ్ వచ్చింది. ఎకరం కనిష్ఠంగా రూ.1.50 కోట్లు పలుకుతోందని స్థానికులు అంటున్నారు. ఆ భూములపై కన్నేసిన అక్రమార్కులు రాజకీయ నాయకుల అండతో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది హంద్రీ నది పరంబోకు భూములు.. ఇక్కడ వెంచర్లు ఎలా వేస్తారు..? అని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తే తాము ఓ వ్యక్తి ద్వారా కొన్నామని, తాము నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మనుషులమని చెబుతున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. రెవిన్యూ అధికారులు, జలవనరుల అధికారులు అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని హంద్రీ నది పరంబోకు భూములు కబ్జాల కోరల నుంచి సంరక్షించాలని కోరుతున్నారు. హంద్రీనది పరివాహకంలో ఉండే చిన్నటేకూరు, పెద్దటేకూరు, బస్తిపాడు, లక్ష్మీపురం, పందిపాడు, పసులూరు, నాయకల్లు, రేమడూరు, బొల్లవరం, కల్లూరు ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే చేసి హంద్రీనది పరంబోకు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కబ్జాకు గురికాకుండా నది రెండు వైపులు 100-200 మీటర్లకు ఒకటి చొప్పున సరిహద్దు సిమెంట్ దిమ్మెలు కట్టాలని పలువురు కోరుతున్నారు.



పెద్దపాడు వద్ద రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కలిసిపోయిన వడ్లోని వంక

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటాం

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం సర్వే నంబరు 1లో హంద్రీ నది పరంబోకు ప్రభుత్వం భూమి 130 ఎకరాలు ఉంది. ఎక్స్‌కవేటర్లతో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసేందుకు కొందరు వ్యక్తులు ప్రభుత్వం భూములను చదును చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో తక్షణమే ఆపేశాం. హంద్రీ నది పరంబోకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నది ఒడ్డున ప్రభుత్వ, బఫర్ జోన్ భూముల్లో వేసిన ప్లాట్లను కొంటే నష్టపోతారు. పెద్దపాడు వడ్లోని వంక అక్రమణపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

- కె. ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు

వంకను కలిపేసుకున్నారు

కల్లూరు మండలం పెద్దపాడు గ్రామం కర్నూలు నగరంలో అంతర్భాగమైంది. అక్కడి స్థిరాస్తి వ్యాపారానికి రెక్కలు వచ్చాయి. ఎకరం రూ.4-5 కోట్లకు పైగా పలుకుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రైవేటు పట్టా భూముల్లో వెంచర్లు వేస్తూ.. పక్కనే ఉన్న వంకలు, వాగులు, ప్రభుత్వ పరంబోకు భూముల్ని కలిపేసుకుంటున్నారు. పెద్దపాడు ఎస్సీ కాలనీ సమీపంలో ఒకప్పుడు వడ్లోని వంక ప్రవహించేది. రికార్డుల ప్రకారం సర్వే నంబరు 128, 138 పరిధిలో 1.80 ఎకరాల వంక పరంబోకు భూమి ఉంది. ఇప్పుడు అది మాయమైంది. దాని పక్కనే గత వైసీపీ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు ఓ రైతు నుంచి ప్రైవేటు భూమిని కొని.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి 1.80 ఎకరాలు కూడా కలుపుకొని ఏకంగా కాంక్రీట్ గోడ కట్టేశారని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడుగా చెప్పుకుంటున్న వ్యక్తి అండతో ఈ భాగోతం సాగినట్లు తెలుస్తోంది. కబ్జాకు గురైన భూమి విలువ దాదాపు రూ.10 కోట్లు పైమాటే అని గ్రామస్తులు అంటున్నారు. వంక కబ్జాకు గురికావడంతో వర్షాకాలంలో భారీ వర్షాలు వస్తే ఎస్సీ కాలనీ ముంపునకు గురవుతున్నది.

డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే. దినేష్ కుమార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు ప్రాంతంలో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఓర్వకల్లు మండలం పాలకొలను, కొమరోలు వద్ద డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువైన స్థలాలుగా సూచించామని తెలిపారు. డ్రోన్ హబ్ ఏర్పాటు వల్ల జిల్లాలో ఎంతో మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్, సభ్యులు

విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తా

● ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యారంగం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక టౌన్ మోడల్ హైస్కూల్‌లో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత పెంచాలని, అందుకు అవసరమైన మెటీరియల్స్‌ను, బుక్స్‌ను తన ఎంపీ నిధులతో విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. అనంతరం జిల్లాలో 2024 జనవరి నుంచి అక్టోబరు నెల వరకు పదవీ విరమణ పొందిన 25 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులను ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్ పాల్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, ఎంఈవో ఓంకార్ యాదవ్, సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి హుశేన్, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, గోవిందరెడ్డి, ఆదాం బాషా, నాగరాజు, వనజ కుమారితో పాటు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం



కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 6 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను పీసీసీ కార్యాలయం నియమించిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కర్నూలు నియోజకవర్గానికి షేక్ జిలానీ బాషా, కోడుమూరుకు పరిగెల మురళీకృష్ణ, ఎమ్మిగనూరుకు ఎం ఖాశీం వలీ, ఆదోనికి జి. రమేష్ యాదవ్, మంత్రాలయానికి పీఎస్ మురళీకృష్ణరాజు, ఆలూరుకు చిప్పగిరి లక్ష్మీనారాయణలను సమన్వయకర్తలుగా నియమించారని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహకు అదనపు బాధ్యతలు



లక్ష్మీనరసింహ యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పజెపుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

నంద్యాల/పాణ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్‌కు పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. జమిలీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరో 50మందిని కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్తలుగా నియమిస్తూ జాబితాను విడుదల చేశారు. అందులో భాగంగా పాణ్యం నియోజకవర్గ సమన్వయకర్తగా లక్ష్మీనరసింహ యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తుగ్గలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1988 నుంచి 93 వరకు 6 నుంచి 10వ తరగతి చదివిన వారు దాదాపు 32 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆ బ్యాచ్‌లో మృతి చెందిన 12 మంది స్నేహితులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అలాగే సమ్మేళనానికి విచ్చేసిన ఆనాటి ఉపాధ్యాయులు హుశేన్‌సాహెబ్, గోపాల్ శర్మ, రాముడు, గంగన్నతో పాటు ప్రధానోపాధ్యాయులు నరేంద్రప్రసాద్‌లను సన్మానించి మెమెంటో అందజేశారు. అనంతరం పాఠశాలకు ప్రింటర్, జిరాక్స్ మిషన్‌లను అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

హేతువాద సంఘం

జాతీయ ప్రధాన కార్యదర్శిగా జేవీ కృష్ణయ్య



కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు జేవీ కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఒంగోలులో శని, ఆదివారాలు జరిగిన హేతువాద సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే శ్రీనివాస్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి. సమరం తదితరులు హేతువాదం ఆవశ్యకతపై ప్రసంగించారు. ఈ సభల్లో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా జేవీ కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా విష్ణుమూర్తి, టి. బాలచందర్, సంయుక్త కార్యదర్శులుగా ఎం. సత్యనారాయణ, బి. సత్తెన్న ఎన్నికయ్యారు.

ఆస్తి కోసం తండ్రిని హత్య చేసిన కొడుకు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

చిప్పగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు దర్యాప్తుచేసి నిందితుడ్ని ఆదివారం అరెస్టు చేశారు. ఆస్తి కోసం కొడుకే కన్నతండ్రిని చంపినట్లు తెలిపారు. చిప్పగిరి-గుంతకల్ మధ్య ఓ పొలంలో సెప్టెంబర్ 13వ తేదీన కురువ కారుమంచప్ప చెట్టుకి ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన తెలిసిందే.. ఆదివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటరామయ్య ఈ ఘటనపై తెలిపిన వివరాల మేరకు... కారుమంచప్ప పెద్ద కుమారుడు శ్రీనివాసులు ఆస్తి కోసం తండ్రిని చంపి చెట్టుకు ఉరివేశాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. 20 ఎకరాల పొలం ఉంది. పెద్ద కుమారుడు శ్రీనివాసులకు మాగాణి పొలాన్ని ఇచ్చాడు. చిన్న కుమారుడు ప్రసాద్‌కు విలువైన పొలాన్ని ఇచ్చాడు. 12 ఎకరాల పొలంలో ఆరు ఎకరాల తన భార్య పేరున రాశాడు. మిగిలిన ఆరు ఎకరాలను ఇద్దరు కూతుళ్లకు సమానంగా పంచి ఇస్తానని చెప్పడంతో కొడుకు తగాదా పడ్డాడు. 12 ఎకరాలు తనకే ఇవ్వాలని పెద్ద కొడుకు తరచూ తగాదా పడేవాడు. ఈ విషయంపై పెద్ద మనుషులతో పంచాయితీ కూడా జరిగింది. తండ్రి ఉంటే తనకు ఆస్తి రాదని భయంతో పెద్ద కొడుకు శ్రీనివాసులు పథకం ప్రకారం ఈ హత్యకు పాల్పడ్డాడు. గుంతకల్ నుంచి చిప్పగిరికి వస్తున్నప్పుడు దారిలో తండ్రిని చంపి, తాము కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు వేలాడదీశాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ వెంకట్రామయ్య వివరించారు.

కష్టాల్లో ఉర్దూ పాఠశాలలు



దెబ్బతిన్న ఉర్దూ పాఠశాల భవనం

5వ పేజీ తరువాయి

రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో ఉర్దూపాఠశాల ఉంది. చాగలమర్రిలో 1 నుంచి 8వ తరగతి వరకు 68 మంది విద్యార్థులు, 9 నుంచి 10వ తరగతి వరకు 15 మంది విద్యార్థులు ఉన్నారు. . ముస్లిం జనాభా ఎక్కువగా ఉండటంతో ప్రాథమిక పాఠశాలను 1 నుంచి 10వ తరగతి దాక మరో పాఠశాలను ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఉన్న ముగ్గురు టీచర్లే అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఉర్దూ పాఠశాల స్థాయిని అప్‌గ్రేడ్ చేశాక అవసరమైన సౌకర్యాలు కల్పించలేదు. గదుల కొరతతో ఒకే గదిలో 5 తరగతులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనంలో మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి ఉపాధ్యాయులు లేరు. వసతులు లేక, ఉపాధ్యాయులు లేక 9, 10 తరగతులు చదివే విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్తున్నారు. కోటగడ్డ ప్రాథమిక పాఠశాలలో 25 మంది ఉండగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు మాత్రమే ఉంది. పెద్దవంగలిలో ముస్లిం జనాభా 60 శాతం పైగా ఉంది. ఇక్కడ ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయకుండా అక్కడ ఉన్న పాఠశాలలో ఒక ఉర్దూ పోస్టు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. పాఠశాలలో తాగునీరు, వంటగది, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. పాఠశాల భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. గత టీడీపీ ప్రభుత్వ హయంలో రూ.24 లక్షల మైనార్టీ నిధులతో భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు చేపట్టారు. ఇందులో రూ.23 లక్షల వరకు పనులు చేశామని, మరో రూ.5 లక్షల బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగిపోయాయి. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు. నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలను రెండో విడతలో ఎంపిక చేసి తిరిగి తొలగించేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలోనే ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి చదువు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● **పది తరువాత ఎలా..**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉర్దూ మాధ్యమంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకు ఉర్దూ కళాశాల లేదు. ఉర్దూ మాధ్యమంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోవడం లేదు



ఉర్దూ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాడు-నేడు పనుల కింద గత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేదు. తరగతులు పెంచారు కానీ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయలేదు. భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

- మాబుహుసేన్, హెచ్ఎం, చాగలమర్రి

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు



ఉర్దూ పాఠశాలలోని సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాల భవనాలకు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారు. నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలను ఎంపిక చేయకపోవడం వాస్తవం.

- అనూరాధ, ఎంఈవో, చాగలమర్రి

సెల్‌ఫోన్‌ను అభివృద్ధికి ఉపయోగించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, జి.పుల్లయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అరచేతిలోకి సెల్ రూపంలో వచ్చిన ఆధునిక విజ్ఞానాన్ని అభివృద్ధికే ఉపయోగించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య రాసిన 'సెల్లు (సెల్‌ఫోన్) పురాణం' శతక పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ తొలుత పుస్తకాన్ని అంకితం ఇచ్చిన దివంగత విశ్రాంత ప్రిన్సిపాల్.. నెల్లూరుకు చెందిన పమిడి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ రాకతో ప్రపంచంలో ఎక్కడికైనా క్షణాల్లో సంప్రదింపులు జరిపే అవకాశం ఏర్పడిందని అన్నారు. అయితే సెల్‌ఫోన్‌ను విజ్ఞానానికి, వినోదానికి ఉపయోగించుకోవాలని అన్నారు. అయితే కొంతమంది దీనివల్ల పెడదోవ పట్టే ప్రమాదం ఉందని అన్నారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, మనిషి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగంగా మారిందని చెప్పారు. రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి. పుల్లయ్య మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభాలూ, నష్టాలూ ఉన్నాయని, అయితే లాభాలకే వాడుకోవాలని అన్నారు. రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ వినియోగం ఎలా మారిందో తెలియజేసేందుకు ఈ పుస్తకం రాశానని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు మహ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, శ్యామ్యూల్ సెల్లు పురాణంలోని హాస్య శతక పద్యాలను చదవి వినిపించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. గత వారంలోనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సిన సీసీఐ సంస్థ పత్తిలో తేమ ఎక్కువగా ఉందని మీనమేషాలు లెక్కిస్తూ వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సీసీఐ సంస్థ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కర్నూలు జిల్లాలో 6 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలను సీసీఐ ఏర్పాట్లు చేసింది. తూకం కాటాలతో పాటు వివిధ ఏర్పాట్లను కూడా చేపట్టింది. సోమవారం నుంచి సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనగుళ్ల ప్రారంభమవతాయని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను, వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు.

వ్యవసాయ రంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

● రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే పోరాటాలే శరణ్యమని, ఆ దిశగా ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దవీరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పూనుకుంటున్నాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేని దుస్థితిలో ఉన్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20వేలు ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైత సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ కార్యదర్శి ఉమాపతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హొళగుంద, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ కాలనీకి చెందిన బోయ ఉలిగేష్ (26) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారం రోజుల క్రితం ఉలిగేష్.. భార్య బళ్లారిలోని ఓపీడీ హాస్పిటల్లో కాన్పు కావడంతో చూసేందుకు బైక్‌పై వెళ్లాడు. తన పెద్దమ్మ సిద్దపురం రంగమ్మతో కలిసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఉలిగేష్ బళ్లారిలోని ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని పెద్దమ్మ మాత్రం చికిత్స పొందుతోంది. దీంతో పాటు పసి బాలుడు సైతం ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. వారం వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెంది, ఒక్కరు తీవ్ర గాయాల పాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కేసీలో యువకుడి గల్లంతు



దినేష్ (ఫైల్)

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వామిరెడ్డినగర్ సమీపంలో ప్రమాదవశాత్తు కేసీలో పడి దినేష్ (20) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం స్థానిక కాలనీ వద్ద కాళ్లు, చేతులు కడుక్కునేందుకు కేసీలో దిగగా ప్రమాదవశాత్తు జారి పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు గుర్తించి కేసీలో దూకి ఆ యువకుడ్ని వెలికితీసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దినేష్ తండ్రి అంజనేయులు ఓ ప్రముఖ దినపత్రిలో ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు, బంధువులు వెంటనే కేసీ వెంట గాలించారు. ఎక్కడా దినేష్ ఆచూకీ లభించలేదు. దినేష్ ఇంటర్ దాకా చదివి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

ప్రగతి కోసం..



- అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రీకరించాలి
- విశ్వవిద్యాయ భవన నిర్మాణాలేమయ్యాయి?
- వలసలతో దెబ్బతింటున్న పల్లె జీవితాలు
- రహదారుల మరమ్మతులు సరే.. శాశ్వత పరిష్కారం ఏదీ..?
- టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలి
- నేటి నుంచి 11 రోజులు అసెంబ్లీ సమావేశాలు
- అమరావతికి బయలుదేరిన కూటమి ఎమ్మెల్యేలు

కర్నూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఎన్నికైన 14 మంది ఎమ్మెల్యేలు జూన్ 21న జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో 12 మంది టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు. నేటి నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో పాల్గొనేందుకు ఆదివారం అమరావతి చేరుకున్నారు. కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఆదోని, డోన్, నందికొట్కూరు, ఆలూరు ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బి.విరుపాక్షి ఈ ఏడు గురు తొలిసారి ఎన్నికైన వారే. బనగానపల్లె, ఎమ్మిగనూరు, శ్రీశైలం, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీజీ జయనాగేశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ రెండో పర్యాయం గెలిచారు. నంద్యాల ఎమ్మెల్యే మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నాలుగు సార్లు గెలిస్తే.. పాణ్యం, మంత్రాలయం ఎమ్మెల్యేలు గౌరు చరిత, వై. బాలనాగిరెడ్డి మూడు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరాక రెండో అసెంబ్లీ సమావేశాలు ఇవి. పూర్తి బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంది. సీనియర్ ఎమ్మెల్యేలు జూనియర్ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి జిల్లా సమస్యలు, ప్రాజెక్టులపై అసెంబ్లీలో గళమెత్తి అత్యధిక నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● **సాగునీటి ప్రాజెక్టులపై పట్టుబట్టాలి:**

జిల్లాలో కరువు శాశ్వత నివారణ జరగాలంటే తుంగభద్ర, కృష్ణా నదుల వరద జలాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే మెట్ట పొలాలు సస్యశ్యామలమవుతాయి. ప్రజా జీవితాన్ని దెబ్బతీస్తున్న కరువు.. వలసల నివారణ సాధ్యం అవుతుంది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారణే లక్ష్యంగా 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని రూ.1,985.42 కోట్లతో చేపట్టిన ఆర్డీఎస్ కుడి కాలువ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని రూ.1,94.80 కోట్లతో చేపట్టి వేదవతి ఎత్తిపోతల పథకం అసంపూర్తి పనులు చేపట్టాలి. హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి ఎడమ కాలువలు కింద 61 వేల ఎకరాలు సాగునీరు అందాలంటే రూ.200 కోట్లు తక్షణమే ఇవ్వాలి. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూ.2,980 కోట్లు గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు వెంటనే చేపట్టాలి. వీటితో పాటు అలగనూరు జలాశయం, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు నిధులు రాబట్టేలా అసెంబ్లీలో గళం వినిపించాలి.

● **టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలి:**

గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ టిడ్కో ఇళ్లు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరంలో 9185 ఇళ్లు, ఆదోని పట్టణంలో 3,800, ఎమ్మిగనూరు పట్టణంలో 3,250, నంద్యాల 5,075 కలిపి 21,300 ఇళ్లు పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రంగులు వేసి వదిలేసింది. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉంది. నిర్మాణాలు పూర్తయిన 21,300 ఇళ్లు పేదలకు పంపిణీ చేయడంతో పాటు అసంపూర్తి ఇళ్లు ఏడాదిలోగా పూర్తి చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో లక్షల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేసేలా అసెంబ్లీ వేదికగా గళం వినిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇవి కూడా:

- పత్తికొండ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం టమోటా జూస్ పరిశ్రమ. 3 వేల హెక్టార్లలో టమోటా సాగు అవుతుంది. టమోటా జూస్ ఫ్యాక్టరీ, టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఉల్లి ప్రాసెసెంగ్ యూనిట్, శీతల గిడ్డంగులపై గళం వినిపించాలి.
- కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో పనులు ఆపేశారు. ఈ పనులు మొదలు పెట్టి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై రూ.20 కోట్ల రూసా నిధులతో చేపట్టారు. అయితే పనులు పునాదులతో ఆగిపోయాయి. ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణం, ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయ భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. ఈ పనులు మొదలు పెట్టాలి.
- జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి.
- ఉమ్మడి జిల్లాలో ఆర్ అండ్ బీ రోడ్లు, జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికి కుళాయి పనులు మళ్లీ మొదలు పెట్టి పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రాబట్టాలి.
- ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాల నిర్మాణం, కోడుమూరు పట్టణం తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్‌పై గట్టిగా పట్టుబట్టి నిధులు, అనుమతులు రాబట్టేందుకు అసెంబ్లీ వేదికగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదవతి స్టేజ్-2 పంప్‌హౌస్



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'పసి నవ్వుల అలలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

నంద్యాల కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కొప్పుల ప్రసాద్ రచించిన 'పసినవ్వుల అలలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాదులో ఘనంగా జరిగింది. రిటైర్డు ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక సమీక్షకులుగా డా.వి. డి.రాజగోపాల్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణ సాహితీవేత్తలు, తెలుగుపండితులు, భాషాభిమానులు, డాక్టర్ సహదేవుడు, డా.రవీంద్రనాథ్, డా.రవికృష్ణ, డా.ఉదయశంకర్, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్రలు తదితరలు కవి కొప్పుల ప్రసాద్‌ను అభినందించారు.

కష్టపడితేనే విజయం సొంతం

నంద్యాల, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి): కష్టపడితేనే విజయం సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రకటించిన టెట్ ఫలితాల్లో అత్యున్నత ర్యాంకులు సాధించిన రాజేశ్వరి కోచింగ్ సెంటర్, జోయా కోచింగ్ సెంటర్‌ల అభ్యర్థులకు ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినప్పటికీ నంద్యాల ప్రాంత అభ్యర్థులు మంచి ర్యాంక్‌లు సాధించడం అభినందనీయమన్నారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న ముస్లింలకు టెట్, డీఎస్సీలో ఉచిత శిక్షణ అందించడం సంతోషకరమన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజేశ్వరి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ గంగాధర్, రమేష్, పీరాసాహెబ్, జిలాని పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని 39వ వార్డులో ఇన్‌చార్జి జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. రూ.100 తో సభ్యత్వ తీసుకుంటే రెండు సంవత్సరాల పాటు కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా ఉంటుందని స్పష్టం చేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

నంద్యాల, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఎం.భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పీఆర్సీ కమిటీతో కాలయాపన చేసి ఉద్యోగులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ అమలు చేయలేని పక్షంలో మధ్యంతర భృతిని 30 శాతం ఇవ్వాలని కోరారు. పీఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లను, ఏపీజీఎల్ఐలను విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరేశ్వరరెడ్డి, జాకీర్‌హుసేన్, దస్తగిరి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరులను ఆదర్శంగా తీసుకోవాలి

ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా



రామయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీడీ సాయిబాబా

ఆత్మకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అటవీ అమరులను ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు చేయాలని ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ వి. సాయిబాబా అన్నారు. ఆదివారం జాతీయ అటవీ అమరుల సంస్మరణ దిన్నాన్ని పురస్కరించుకుని బైర్లూటి ఎకో టూరిజంలోని రేంజ్ అధికారి రామయ్య స్మారక స్తూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు అడవుల విధ్వంసానికి పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కొనేందుకు అటవీ శాఖ నిత్యం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, బైర్లూటి, నాగలూటి, వెలుగోడు రేంజర్లు పట్టాభి, కృష్ణప్రసాద్, దొరస్వామి, ఎంఎ ఖాన్, ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేష న్ డివిజన్ అధ్యక్షుడు మగ్బుల్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అమర వీరుల త్యాగాలు మరువ లేనివి

ఆత్మకూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ అమర వీరుల త్యాగాలు మరువ లేనివని రాష్ట్ర డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ అండ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆత్మకూరు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈ. వెంకటరమణ అన్నారు. శనివారం అటవీ అమర వీరుల దినం సందర్భంగా మండంలోని కరివేన ఎస్సార్బీసీ కాలనీ వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ ఎస్‌వోలు మహేశ్వరమ్మ, మస్తానయ్య, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు

మహానందిలో కార్తీక శోభ

దీపాలు వెలిగించిన మహిళలు

మహానంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక శోభ సంతరించుకుంది. పరిసరాల్లోని నాగులకట్ట, ధ్వజస్తంభంతో పాటు పంచలింగాల మండపాల వద్ద భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఆదివారం సెలవు దినడం కావడంతోపాటు కార్తీక మాసం పురస్కరించుకొని వేలాది మంది భక్తులు మహానందికి తరలి వచ్చారు. దీంతో ఆలయం కిక్కిరిపోయింది. తెల్లవారు జామున నాలుగు గంటలకే ప్రధాన ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన రుద్రగుండం కోనే రుతోపాటు పూల కోనేర్లలో భక్తులు కార్తీక మాసం పురస్కరించుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు పర్యవేక్షించారు.

మహానందిలో..





మహానంది నాగులకట్ట వద్ద దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కిక్కిరిసిన కొత్తూరు

స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు



భక్తులకు అన్నదానం



కొత్తూరులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



భక్తులతో కిక్కిరిసిన కొత్తూరు ఆలయం

పాణ్యం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని సుబ్రమణ్యం స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడడంతో ఆలయ అధికారులు ప్రైవేటు స్థలంలో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తులు కార్తీక దీపోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే నంద్యాల ఎన్జీఓస్ కాలనీకి చెందిన భక్తులు నాగేంద్ర, నాగేష్, వెంకటరాముడు, ప్రసాద్, క్రిష్ణమోహన్, సుబ్బయ్య, గోవిందరెడ్డి, నారాయణరెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నాలుగు వేల మందికి అల్పాహారం అందించారు. పాణ్యం పోలీసులు ప్రత్యేక బందోబస్తు కల్పించారు.

శంఖారావం సభను జయప్రదం చేయండి

ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకుల పిలుపు



ఆత్మకూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు



నందికొట్కూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం విజయవాడ నగరంలో జనవరి 5వ తేదీన జరగబోవు హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, శేషసాయి, అపర్ణ దీపిక అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మంటపంలో జరిగిన ఆత్మకూరు ఖండ స్థాయి హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. దేవదాయ, ధర్మదాయ శాఖలో పని చేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని, ఆలయాల్లో అపచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, రాజకీయ ప్రమేయం లేకుండా ఆలయాల ట్రస్టు బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆలయాల పరిసరాల్లో హిందువులకు మాత్రమే దుకాణాలు కేటాయించాలని, అన్యాక్రాంతమైన దేవాలయాల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కోరారు. హిందూ సమాజం, ఆలయాలపై జరుగుతున్న కుట్రపూరిత దాడులను అరికట్టాలని, హిందూ దేవాలయాల భూముల్లో నిర్మించిన అన్యమస్థుల కట్టడాలను తొలగించాలని దేవాలయాల ఆదాయం ధర్మప్రచారానికే ఉపయోగించాలని అన్నారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు గారుడాద్రి, సుదర్శన్, వాసుదేవరెడ్డి, శ్రీధర్‌గుప్తా, భానుమూర్తి, ఆవులరెడ్డి, రాజేష్ తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: జనవరిలో విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అలువాల సత్రంలో సన్నాహక సమావేశాన్ని విశ్వ హిందూ పరిషత్ నాయకులు రాంప్రసాద్, భజరంగదళ్ కమ్మయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ హిందూ దేవాలయాలకు ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కలిగించాలని అన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని విశ్వ హిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమం లో బాలయ్య, భజరంగదల్, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ, బీజేవైఎం పలు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ



పాములపాడులో ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

పాములపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓటు నమోదు కేంద్రాలను ఆర్డీఓ నాగజ్యోతి తనిఖీ నిర్వహించారు. ఆదివారం మండలంలోని ఎర్రగూడూరు, రుద్రవరం, పాముల పాడు గ్రామాల్లో పోలింగ్ బూతుల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటరు నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పులు వంటి అంశాలపై ఆరా తీశారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ఆత్మకూరు: మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో యువత కొత్తగా ఓటు నమోదు చేయిం చుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆమె సందర్శించారు. ఈ శిబిరాల్లో దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు.



ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రత్నరాధిక

అలగనూరు రిజర్వాయర్ గండి పూడ్చాలి



జీపు జాతాలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మిడుతూరు, నవంబరు 10: అలగనూరు రిజర్వాయర్ గండి పూడ్చి రైతులకు సాగు నీరు తాగు నీరందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయకులు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యులు పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం మిడుతూరు మండలంలోని గ్రామాల్లో జీపు ప్రచార జాతా నిర్వహించారు. మిడుతూరు బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిని సభలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ కట్ట తెగి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా మరమ్మతులు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట శివుడు, నాగరాజు, పెద్దరాముడు, వెంకటస్వామి, అబ్రహం బాషా, సామన్న, మాబాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న బుడగ జంగాల నాయకులు

బండిఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బేడ, బుడగ జంగాల సంఘం అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గ రాముడు, మహేష్ బాబు కోరారు. శనివారం శ్రీశైలం సీప్లేన్ పర్యటన సందర్భంగా వారు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రత్యేక రుణాలు అందజేయాలని కోరినట్లు వారు తెలిపారు.

హామీలను నెరవేర్చాలని: సీపీఎం



ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎపీఎం మండల కన్వీనరు పక్కీర్‌సాహెబ్ అన్నారు. పగిడ్యాల బస్టాండ్ ఆవరణలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆది వారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. నిత్యావసర సరు కుల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్య ల పరిష్కారం కోసం 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో ఉసేనమ్మ, త్యాగరాజు, మధులత, మద్దమ్మ, వెంకటేశ్వర్లు, నాగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరిరెడ్డికి అరుదైన గౌరవం

నంద్యాల, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ ఛైర్మన్ డా. దస్తగిరిరెడ్డికి అరుదైన గౌరవం లభించింది. కోచింగ్ సెంటర్ ద్వారా 42,500 మంది విద్యార్థులను బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు చేసిన విశిష్ట సేవలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆయనకు చోటు దక్కింది.

మహానందిలో వసుధారాణి పూజలు

మహానంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం రాత్రి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఈమె ప్రధాన ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మలు వీరిని సన్మానించి ఆశీర్వదించారు.

వసతి గృహాల పనులు పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈవో

శ్రీశైలం, నవంబరు 10: శ్రీశైలం దేవస్థానం సిబ్బంది కోసం సుండిపెంట ప్రాజెక్టు కాలనీలో నిర్మిస్తున్న వసతి గృహాల భవనాలను ఆదివారం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి ఇ. చంద్రశేఖరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ వసతి గృహాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న అధికారి



శ్రీశైలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరుకు చెందిన పసుపులేటి నాగరాజు రూ.లక్ష విరాళాన్ని, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం. వసంతలక్ష్మి అనే భక్తురాలు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని ఏఈవో జి. స్వాములుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

14న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

బేతంచెర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి మధుశేఖర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో సీపీఎం ప్రజాపోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 130 రోజులు పూర్తయినా ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల రేట్లు ఆకాశానికి ఎగబాకుతున్నాయని పాలకులకు ఇవేమి పట్టడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ నాయకులు ఎస్‌కే భాషా, గుల్జార్, రామాంజనేయులు, శ్రీనివాసులు, రామకృష్ణ, రాజాబాబు, రామచంద్రుడు, వెంకట్రాముడు, స్వామి నాయుడు, రమణారెడ్డి, గోరంట్ల పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న రెడ్ల సంఘం నాయకులు

బేతంచెర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడమే రెడ్ల సంక్షేమ సంఘం ధ్యేయమని కర్నూలు ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరి దేవి కల్యాణ మండపంలో బేతంచెర్ల రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చౌడేశ్వరి దేవి ఆలయం ప్రాంగణంలో ఉన్న ఉసిరికాయ చెట్టుకు కార్తీకమాస పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ గార్మెంట్ సుబ్బారెడ్డి పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎక్కువసార్లు రక్తదానం చేసిన కైపా ప్రతాప్ రెడ్డి సతీమణిని లక్ష్మీదేవితో పాటు రక్తదాతలను సన్మానించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నంద్యాల అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, ఆర్ఎస్ రంగాపురం మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, భారత్ డీలర్ బుగ్గన రమణారెడ్డి, ఆయా గ్రామాల రెడ్ల సామాజిక వర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠోత్సవం

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో కన్యకాపరమేశ్వరి, కోదండరామాలయాల ప్రతిష్ఠోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, గణపతిపూజ కార్యక్రమాలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధతో కుంకుమార్చన చేశారు. అమ్మవారికి సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం చేశారు. అనంతరం వాసవీ మాతను గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నరసింహరావు, కోశాధికారిమాధవ్, కార్యదర్శి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తుండ్లవాగు రిజర్వాయరుకు మంచి రోజులు

రుద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీలోని తుండ్లవాగు రిజర్వాయరుకు ఇక మంచిరోజులు వచ్చాయి. సీఎం క్యాంపు కార్యాలయం నుంచి తుండ్లవాగు రిజర్వాయరు అభివృద్ధి నివేదికలు ఇవ్వాలంటూ ఆదేశాలు తెలుగుగంగ అధికారులకు అందాయి. 2024 ఆగస్టు 28న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి వినతి అందించారు. సీఎం స్పందిస్తూ 2024 సెప్టెంబరు 6న నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు తెలుగుగంగ అధికారులకు పంపించారు. ప్రస్తుతం 0.4 టీఎంసీలుగా ఉన్న రిజర్వాయరును 0.56 టీఎంసీలుగా సామర్థ్యం పెంచేందుకు నివేదికలు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక నల్లమల తీరం రైతులకు, ప్రజలకు మంచిరోజులు వచ్చినట్లే. ఈ విషయమై తెలుగుగంగ ఈఈ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం క్యాంపు కార్యాయలం నుంచి ఆదేశాలు అందడంతో రూ.46 కోట్లతో నివేదికలు సిద్ధం చేసి పంపించామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ రమణయ్య కోరారు. ఆదివారం రాత్రి ముదిగేడు గ్రామంలో ఏర్పాటైన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు అధికమయ్యాయన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను అడిగితే తెలపరాదని సూచించారు. అనంతరం ముదిగేటమ్మ ఆలయం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు లేని వాహనదారు లకు అపరాధ రుసుము విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేశ్వరీ ఆలయానికి విరాళం

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం నందవరం చౌడేశ్వరీ మాత ఆలయానికి చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన భక్తులు రూ.50వేలు విరాళం ఆదివారం అందించారు. మదనపల్లె శంకరపు భాస్కరరావు కుటుంబ సభ్యులు రూ.25వేలు, బొమ్మిశెట్టి ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.25 వేలు ఆలయ ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో అందజేశారు.

కార్తీక దీపం విశిష్టతను తెలుసుకోవాలి

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుడిలో కార్తీక దీపం వెలిగించే భక్తులు దానియొక్క విశిష్టతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రభోధా సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రామాంజినేయులు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని గోవిందిన్నె, హుసేనాపురం గ్రామాల్లో భగవద్గీత, కార్తీక దీపం విశిష్టతపై ప్రచారం చేశారు. మద్దమ్మ, జయోశ్వరి, మనోహర్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్పెంటర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం టిప్పు సుల్తాన్ 274వ జయంతి వేడుకలను నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు చాంద్‌బాషా, ఖాదర్‌బాషా, మహమ్మద్‌హుస్సేన్, మహబూబ్‌బాషా, జమీందారువల్లి, అబ్దుల్‌సమ్మద్ తదితరులు టిప్పు సుల్తాన్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

యువకుడి ఆత్మహత్య

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన వడ్డె సుంకన్న కుమారుడు వడ్డె చంద్ర (18) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చంద్ర విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి కుంటలా రహదారులు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఉయ్యాలవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు నీటి కుంటలను తలపిస్తున్నాయి. వీటి వల్ల వాహన రాకపోకలకు, కాలినడక ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని మాయలూరు గ్రామ శివాలయం ప్రధాన రహదారిపైకి ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు అంతా చేరి అధ్వానంగా మారింది. రోడ్డు అవతలి వైపు ఉన్న మురుగు కాలువ గొట్టపు మార్గం వ్యర్థాలతో నిండిపోయి మూసుకపోయింది. దీంతో ఇటువైపు నుంచి అటువైపునకు నీరు వెళ్లే మార్గం లేక అక్కడే నీరు నిలిచిపోతోంది. నెలల తరబడి నీళ్ల నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల స్థాయి అధికారులు ఆ రహదారిలో ప్రయాణం కొనసాగిస్తున్నప్పటికీ చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. అలాగే మండలంలోని ఇంజేడు- పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి నీటి కుంటను తలపిస్తుంది. ఈ రహదారిలో మోకాళ్లలోతు నీళ్ల ప్రవహిస్తున్నాయి. ఇది ద్విచక్ర వాహన దారులకు, ఆటోలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. మోటారు సైకిళ్ల సైలెసర్లలోకి నీరు చేరి వాహననాలు నీటి మధ్యలో ఆగిపోతున్నాయి. కొందరి వాహనాలు అదుపుతప్పి కిందపడిపోతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇంజేడు - పెద్దయమ్మనూరు గ్రామ మధ్య మోకాళ్లలోతు నిలిచిన నీరు



మాయలూరు గ్రామంలో నీటి కుంటను తలపిస్తున్న ప్రధాన రహదారి

మురుగు కాలువలు శుభ్రం చేయించాలి



గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయిస్తే బాగుంటుంది. శివాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. వ్యర్థాలు పేరుకపోయి మురుగుకాలువ మార్గం మూసుకొని పోయింది. అధికారులు స్పందించి కాలువ గొట్టాని బాగు చేయించాలి.

- శంకర్‌రెడ్డి, మాయలూరు గ్రామం

కాలువను శుభ్రం చేయిస్తాం

మాయలూరు గ్రామంలో సీసీ రోడ్డు లోపలి భాగంగలో ఉన్న మురుగు కాలువ గొట్టం మూసుకపోయి ఇబ్బందికరంగా మారింది. కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ, ఉయ్యాలవాడ

వెలవెలబోయిన ఓటరు నమోదు కేంద్రాలు

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన కరువైంది. ఆదివారం ఓటరు నమోదు కేంద్రాలు వెలవెలబోయాయి. ప్రజలకు సమాచారం ఇవ్వడంలో సంబంధిత అధికారులు విఫలమవడంతో యువ ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి రాలేదు. చాగలమర్రిలోని మండలపరిషత్ ప్రధాన పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు, పాత పంచాయతీలోని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత సిబ్బంది ఫొటోలు తీసుకొని పోలింగ్ కేంద్రాలకు తాళాలు వేసుకొని వెళ్లిపోయారు. మరి కొందరు 9వ తేదీ తీసుకున్న ఫొటోలు గ్రూప్‌లో పెట్టి గైర్హాజరు కావడం గమనార్హం. ప్రత్యేక ఓటరు నమోదు పర్యవేక్షణ కొరవడంతో స్పెషల్ క్యాంపు నిర్వహణ నీరుగారింది. కొన్ని చోట్ల కేంద్రాలు నామమాత్రంగా నిర్వహించారు.



చాగలమర్రిలో ఓటరు నమోదు కేంద్రానికి తాళం వేసిన దృశ్యం



తాళం వేసి ఉన్న అల్లూరు గ్రామ పోలింగ్ కేంద్రం

అల్లూరు గ్రామంలో పోలింగ్ కేంద్రాలకు తాళం

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అల్లూరు గ్రామంలో నిర్వహించలేదు. ఆ గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాలున్నాయి. అక్కడ ఇద్దరు బీఎల్‌వోలు, ఇద్దరు వీఆర్‌ఏలు ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలి. కానీ, మధ్యాహ్నం 2.30 గంటలకు పోలింగ్ కేంద్రాలకు తాళం వేసి ఉండటంతో తహసీల్దారు శ్రీనివాసులును వివరణ కోరగా తమకు సమాచారం లేదని, విచారించి చెబుతానన్నారు. సాయంత్రం 4.30 గంట లకు పదవ నంబరు బీఎల్‌వో నిర్మల విధులకు వచ్చినట్లు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



రుద్రవరంలో మాట్లాడుతున్న రేంజర్ శ్రీపతినాయుడు

రుద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో పనిచేసి అమరులైన అధికారుల సేవలు మరువలేనివని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. ఆదివారం రుద్రవరం రేంజ్ కార్యాలయంలో అటవీ అమరువీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణుల వేట ఎర్రచందనం అక్రమరవాణా, అటవీభూముల ఆక్రమణవంటి అంశాల విషయంలో తగు చర్యలు తీసుకుంటూ సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. సిబ్బంది ఐకమత్యంగా ఉండి అటవీ రక్షణలో పాటుపడాలన్నారు. గతంలో అటవీశాఖలో పనిచేసి వివిధ కారణాలతో అమరులైన వారి సేవలు గుర్తు చేశారు. అటవీశాఖలో విధినిర్వహణ కత్తిమీద సాములాంటిదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాసం పవిత్రమైనది



దీపాలు వెలిగిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజానికి కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీ మణి బీసీ ఇందిరమ్మ అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణ సమీపంలోని నేలమఠం నందు కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన భోజన ఉత్సవంలో బీసీ ఇం దిరమ్మ పాల్గొన్నారు. స్వామి వారి సన్నిధిలో కార్తీక దీపం వెలిగించి పూజలు నిర్వహించారు, కుమ్మరి శాలివాహన వర్గానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆమె అన్నారు.

వైభవంగా కార్తీకమాస పూజలు

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని భైరవీ శ్వర, రా మలింగేశ్వర, భీమ లింగేశ్వర ఆలయాల్లో ఆదివారం కార్తీకమా స పూజలు వైభవం గా నిర్వహించారు. చాగలమర్రి పాత శివాలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, బియ్యం, పండ్లు సమర్పించి సా మూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల పల్లకి ఉత్సవం చేశారు. భైరవీశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పా టు చేశారు. పౌర్ణమి సందర్భంగా 15న జ్వాలా తోరణం, శివపార్వతుల కల్యా ణ మహోత్సవం, హోమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు అన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీల సంక్షేమాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. చంద్ర బాబు విజన్ ఉన్న నాయకుడని అన్నారు. బీసీలకు కార్పొరేషన్‌లో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, ధనుంజయుడు, లాలయ్య, సిద్ధప్ప, పుల్లయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

24న గౌడ సంఘం కార్తీక వన భోజనాలు



కేశన్నగౌడ్‌కు ఆహ్వానపత్రికను ఇస్తున్న సంఘం నాయకులు

డోన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24 న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు టీఈ రాఘవేంద్రగౌడు, కేతఈ చంద్రమౌళి గౌడు తెలిపారు. ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడును గౌడ సంఘం నాయకులు వెంకటేశ్‌గౌడు తదితరులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీఈ కేశన్నగౌడు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని గౌడ సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక వన భోజనాన్ని విజయవంతం చేయాలన్నారు. గౌడల అభివృద్ధి కోసం ప్రభుత్వం గౌడ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పేద గౌడలకు చేయూతనిచ్చేందుకు తన సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు.

కార్యకర్తలే పార్టీకి కీలకం



చాగలమర్రిలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో టీడీపీ పార్టీకి కార్యకర్తలే కీలకమని టీడీపీ నాయకులు మౌలాలి, కార్యదర్శి అనిఫ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామం లోని చెంచు కాలనీలో సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, గౌస్ మొద్దీన్, అజీమ్, గఫార్, రియాజ్, బషీర్, ఫరూక్, రాజేష్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ డోన్ సమన్వయకర్తగా మద్దిలేటి



గార్లపాటి మద్దిలేటి

డోన్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ సమన్వయకర్తగా గార్లపాటి మద్దిలేటి నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించిన జాబితాలో గార్లపాటి మద్దిలేటిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన గార్లపాటి మద్దిలేటి గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గానికి..



హుసేన్ బాషా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : ఆళ్లగడ్డ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా(సమన్వయకర్త) బీ హుసేన్ బాషాను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

అవుకు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమనాయుని పల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్సైజ్ సీఐ వర్దనాదేవి ఆధ్వర్యంలో దాడులు జరిపి సారా బట్టీలను ధ్వంసం చేశామన్నారు. అక్కడ నిల్వ ఉంచిన 2500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

డ్రిప్ పైపుల దగ్ధం

కొలిమిగుండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదనంతపురం గ్రామానికి చెందిన కొట్టె క్రిష్టారెడ్డి అనే రైతుకు సంబంధించిన పొలంలో డ్రిప్ పైపులు ఆదివారం దగ్ధమయ్యాయి. రూ.60వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.

పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

బేతంచెర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ ప్రధాన కర్యాదర్శి నాగరాజు అధ్యక్షతన పట్టణ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు భార్గవ్, తిరుమలేష్, డి.దస్తగిరి, ఉదయ్, ఏలియా, కోదండరామయ్య, రమణయ్య, మధురామయ్య, లక్ష్మయ్య, శివ, విధాత రామదాస్, దనుంయ, శంకర్, సుబ్బారావు, మధు కిరణ్, ఎలక్ట్రికల్ శ్రీకర్ దిలీప్, మధు, నంది విశ్వనాథ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్

డోన్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని పెన్షనర్ల సంఘం సభ్యుడు కేఎన్ భానుసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని అమలు చేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. పెన్షనర్ల హెల్త్ కార్డులు అన్ని హాస్పిటల్‌లో అమలయ్యే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. వచ్చే నెల 17న పెన్షనర్ల డేను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు సుబ్బరాయుడు, గోపాల్, గాలయ్య, దాసప్ప, రామసుబ్బారెడ్డి, పురుషోత్తం, రిటైర్డు ఎస్ఐ మౌలాలి పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

డోన్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈ నెల 14న నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, నాయకులు మోటరాముడు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

గొడవలకు దూరంగా ఉండాలి

శిరివెళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు గొడవలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెళగాలని ఎస్ఐ చిన్న పీరయ్య సూచించారు. మండలంలోని రౌడీషీటర్లకు శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వంద గొర్రెలు మృతి

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తండా గ్రామంలో బొబ్బరాల వ్యాధి సోకి వారం రోజుల్లో 100 గొర్రెలు పైగా మృతి చెందాయి. గ్రామంలోని శంకర్‌నాయక్‌కు చెందిన పది గొర్రెలతోపాటు శ్రీరామ్‌నాయక్ 20 గొర్రెలు, పిచ్చయ్యనాయక్ 35 గొర్రెలు, ఇంకా మరికొందరి గొర్రెలు చనిపోయాయి. దాదాపు రూ.10 లక్షలు దాకా నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ గొర్రెలు బొబ్బలు వచ్చి అక్కడికక్కడే మృతి చెందుతున్నాయని అన్నారు. ప్రభుత్వపరంగా పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ గ్రామాన్ని సందర్శించి గొర్రెల పెంపకందారులను పరామర్శించారు. చనిపోయిన గొర్రెల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి గొర్రెలు మృతి చెందకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. మృతి చెందిన గొర్రెలకు పరిహారం కోసం ప్రతిపాదనలు చేస్తామన్నారు.

ఏఈ ప్రసన్నాంజనేయులు బదిలీ

కొలిమిగుండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్నాంజనేయులు ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. గత 19 నెలలుగా కొలిమిగుండ్ల మండలానికి విద్యుత్ శాఖ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనను జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మిగనూరు ఏఈ గా బదిలీ చేశారు. దీంతో ఆయన కొలిమిగుండ్ల నుంచి రిలీవ్ అయినట్లు సబ్ ఇంజనీర్ లక్ష్మణస్వామి ఆదివారం వెల్లడించారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆదరణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జజ్జూరి మరియదాసు అన్నారు. మండలంలోని మిట్టపల్లె గ్రామంలో దివ్యాంగుల ఆదరణ సేవా సమితి కమిటీ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షురాలిగా గడ్డం లక్ష్మీదేవి, వైస్ ప్రసిడెంట్‌గా చంటి ఓబులేసు, కార్యదర్శిగా చిన్న నారాయణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అబ్దుల్, బాల ఎల్లప్ప, సత్తార్ సాహెబ్ పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి పునర్జన్మ



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న రక్త దాతలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరికి పునర్జన్మ కలుగుతుందని ఆళ్లగడ్డ రక్త దాతల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ హుసేన్ అన్నారు. పట్టణానికి చెందిన షేక్ చాంద్‌బాషా ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు మస్తాన్ వలి, సద్దాం, బషీర్‌లతో పాటు 13 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆదివారం రక్తదానం చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాతలకు బ్లడ్ సెంటర్ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం

రుద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘం ఓటర్ల జాబితా సిద్ధం చేశామని తహసీల్దారు మల్లికార్జునరావు ఆదివారం తెలిపారు. మండలంలో 16 చెరువులు సాగునీటి సంఘాలు ఎన్నికలు, 13 తెలుగుగంగ సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సిద్ధం చేశామన్నారు. ఈ నెల 20 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు ఉండవచ్చని తహసీల్దారు తెలిపారు.